


'యల్' బోర్డు!

కొత్తగా నేర్చుకునేటప్పుడు కారుకీ, స్కూటరుకీ 'యల్' బోర్డులు తగిలిస్తారు. సదరు డ్రైవరుగారు కొత్తగా రంగంలోకి దిగేరని అదొక హెచ్చరిక. గోడని గుద్దినా, చెట్టుని కొట్టినా క్షమించండని అర్థం. ఆ వాహనం మీ కెదురొస్తే దయచేసి తొలగండని విజ్ఞప్తి. మనం వారికి దారిచ్చి పంపించాలేగాని వారి దారికి అడ్డం పడకూడదు. కొత్తలో అన్నీ యిట్లాగే వుంటాయి.

పిల్లవాడికి అయిదోఏట అక్షరాభ్యాసం చేస్తారు. మెల్లిగా స్కూల్లో వేస్తారు. నిన్న మొన్నటి వరకూ ఇల్లే ప్రపంచమనుకుని ఇంట్లో ఆడుకునే సదరు పిల్లవాడికి స్కూలుకి వెళ్ళి కూర్చోవాలంటే కొత్తగానే వుంటుంది. ఇంటి ముందు రిక్షా ఆగగానే వంట గదిలోకి తుర్రుమని పారిపోతాడు -

అమ్మ చాటున చేరిపోయి రిక్షాని పంపించేయమని ఏడుస్తూ చెబుతాడు. అమ్మ సంగతేమోగానీ తండ్రికి హీటెక్కి పోతుంది. రిక్షా ఎక్కమని అరుస్తాడు. ఆయనరుస్తే మరింత ఏడుస్తాడు. తల్లి ఏదో సర్ది చెప్పబోతుంది. నోరు ముయ్యమంటాడు తండ్రి — ఇట్లా గారం చేసి నెత్తికెక్కించుకుంటే, రేప్పొద్దున గాడిదలు కాయడానికి కూడా చెల్లుబడికాడని జోస్యం చెబుతాడు. ఆ మాటతో అమ్మకి రోషం వస్తుంది. తన వంశం ఎంత గొప్పదో చెబుతుంది. దాంతో అవతలి వంశం ఎంత హీనమో అందరికీ అర్థమవుతుంది. తన వంశాచార ప్రకారం తన బిడ్డ చక్రవర్తే అవుతాడని గ్యారంటీ యిస్తుంది. బిడ్డ చక్రవర్తి అవుతాడన్నందుకు ఆనందించినా, తన తరఫు వాళ్ళని దుమ్మెత్తి పోసినందుకు తండ్రి కోపం వస్తుంది. మాటా మాటా పెరుగుతుంది. యుద్ధం జరుగుతుంది. ఇది ఆసరాగా చేసుకొని పిల్లవాడు జారుకుంటాడు. ఇవాళ బడి కెళ్ళొద్దన్నారని రిక్షావాడిని పంపించేసి పక్కింట్లో దాక్కుంటాడు. కొత్త గనక ఇంత అల్లరి జరిగిందిగాని, అదే అలవాటైతే ఇంటికంటే బడే బెటరనుకుంటాడు చిరంజీవి.

పెళ్ళయిన కొత్తలో నూతన దంపతులు చిలకా గోరింకల్లే ఎంతో అన్యోన్యంగా వుంటారు పాపం. మీరు సాక్షాత్తూ దేవుళ్ళంటుంది ఆమె. నువు నా పాలిటి భాగ్యదేవతవంటాడు అతను. ఆరేడు నెలలపాటు ఇలాంటి కవిత్వాలే మాట్లాడుకుంటారు. హోటల్లో భోజనాలు, రోజూ సినిమాలూ, షికార్లు హోరాహోరీగా జరిగి పోతుంది కాలం. భార్యామణి కొంగుపట్టుకు తిరగడంలో అతగాడు తన ఫ్రండ్సందర్నీ మరచిపోతాడు. ఆహా ఏమి నా సౌభాగ్యం అనుకుంటుందామె. ఈ ఘట్టానికి అంతటితో తెర పడి పోతుంది. కొత్త దృశ్యం ప్రారంభమవుతుంది. సాయంత్రం అయిదున్నరకి ఆఫీసునుంచి వచ్చే భర్త మెల్లిగా రాత్రి తొమ్మిది, పది గంటలకు రావడం మొదలు పెడతాడు. ఆదివారాలు ఇల్లొదిలి పారిపోతాడు. ఒకటి, రెండు సినిమాలు ఒంటరిగా చూస్తాడు. ఏమిటిది నాథా? అనడిగితే నోరు ముయ్యమంటాడు. మీరు జూదం అడుతున్నట్లు తెలిసింది నిజమేనా స్వామీ! అని ఆరా తీస్తే తాగుతాను కూడా అని కటువుగా సమాధానమిస్తాడు. అట్లా అట్లా వాళ్ళిద్దరూ చిరాకుల రొటీన్లో పడిపోతారు.

అత్తా కోడళ్ళ సంబంధాలు కూడా యిలాగే వుంటాయి. కొత్తగా అత్తారింటికి వచ్చిన కోడలు పిల్ల అత్తగారికి అపర లక్ష్మీదేవిగా కనిపిస్తుంది. నాతల్లే నాతల్లే అవి బుగ్గలు పుణికి దగ్గిర చేసుకుంటుంది అత్తగారు. స్వయంగా తానే కోడలికి జడ అల్లుతుంది. పూలు పెడుతుంది. ఆ పిల్ల పొరపాటున చెంబు తోమినా, ఇల్లు వూడ్చినా విలవిల్లాడి పోతుంది. నువ్వసలు మంచం దిగకని ఆర్డరు వేస్తుంది. ఇదే విధంగా కోడలు పిల్లకి అత్తగారు సాక్షాత్తు అన్నపూర్ణాదేవిలా అగుపిస్తుంది. కన్నతల్లి కంటే అపురూపంగా ఎంచు కుంటుంది. పెద్దవారు మీరుండండి, నేనున్నాను కదాని ప్రతి పనికీ అడ్డంపడి అత్తగార్ని మురిపిస్తుంది. కొంచెం కాలం గడవగానే కొత్తదనం పోతుంది. బండి రొటీన్లో పడుతుంది. అత్తకి దెయ్యంముండని కోడలు బిరుదిస్తే, దరిద్రగొట్టు సంబంధమని అత్తగారు కోడలి పుట్టింటికి సర్టిఫికెటిస్తుంది.

కొత్తల్లుళ్ళ సరదాలు కూడా ఇల్లాగే నడుస్తాయి. పెళ్ళయిన మొదటి సంవత్సరంలో ప్రతి పండక్కీ పిలుస్తారు అత్తవారు. బావమరుదులు వంగి వంగి దణ్ణాలు పెడతారు. అత్తమామలు అపారంగా గౌరవిస్తారు. తొమ్మిది రకాల వంటకాలతో అల్లుణ్ణి అదరగొడతారు. ఆ తర్వాత, తర్వాత ఈ ముచ్చట్లు కరువైపోతాయి. పండగొదిలేయండి. ఆ వూళ్ళో పనిబడి అత్తారింటికి వెళితే కనీసం కాళ్ళకి నీళ్ళివ్వరు. ఏమిటిలా వచ్చేవని పలుక రించరు. అడిగితే అన్నం పెట్టొచ్చుగానీ విస్తట్లో పచ్చడి మెతుకులే.

కొత్తగా చేరిన గుమస్తాగానీ, టైపిస్టుగానీ ఆఫీసులో తప్పనిసరిగా కొన్ని ఇబ్బందు లెదుర్కోవాలి. డ్రాఫ్టు రాస్తే, నీ మొహంలాగుం దంటారు. టైపు కొడితే ఏడ్చినట్టుందంటారు. ప్యూనుని పిలిస్తే రాను పొమ్మంటాడు. అందరి పనీ కొత్తమనిషి మీద పడుతుంది. లోడెక్కువై నలిగి పోతాడు. బెదరిపోయి రాజీనామా యిస్తే ప్రయోజనం లేదు. కాలం గడిస్తే ఆ కొత్త మనిషే ఆటోమేటిగ్గా కింగవుతాడు. చాకులా మెరుస్తాడు. మాట మీరితే గుండెల్లో దూసుకు పోతానంటాడు. దేనికైనా సర్వీసుండాలి. ఎంత సర్వీసుంటే అంత రాణిస్తాడు.